క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న అశోక్‌యాదవ్

షాద్‌నగర్: పట్టణ శివారు బైపాస్ రోడ్డు సమీపంలోని యాదవ కాలనీలో ఉన్న బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ యువ నాయకుడు నందారం అశోక్‌యాదవ్ రూ.3.69లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గురువారం కాలనీవాసులు అశోక్‌యాదవ్‌ను కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన రూ.3.69లక్షల విరాళాన్ని ప్రకటించి, చెక్కును వారికి అందజేశారు. అనంతరం కాలనీవాసులు దాతను సన్మానించారు. కార్యక్రమంలో నడికూడ రఘునాథ్‌యాదవ్, రవికుమార్‌యాదవ్, సురేశ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వంశరాజ్ కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్

కొత్తూరు: వంశరాజ్ కులస్తులు ప్రస్తుతం సమాజంలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేశ్ కోరారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన బీసీ కమిషన్ సమావేశంలో పాల్గొని అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంశరాజ్ కులస్తుల పేరు చివరన గతంలో మాదిరిగా పిచ్చగుంట్ల అనే పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గ్రామాల్లో నాయకులు, పలువురు ఆయా సందర్భాల్లో తమ కులాన్ని తక్కువ చేసి మాట్లాడే విధానానికి స్వస్తి పలకాలన్నారు. ఉద్దేశపూర్వకంగా తమను కులం పేరుతో దూషించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా జనాభా పరంగా తక్కువ సంఖ్యలో ఉన్న తమకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సంఘం నాయకుడు సురేశ్



జెండా ఆవిష్కరిస్తున్న సురేశ్, నాయకులు

కొత్తూరు: ప్రభుత్వాలు అందించే సాయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకుంటూ మత్స్యకారులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని గూడూరు గ్రామానికి చెందిన మత్స్యకార సంఘం నాయకుడు సురేశ్ కోరారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన గూడూరు గ్రామంలో పలువురితో కలిసి మత్స్యకార సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరిన్ని పథకాలను అమలు చేయాలని కోరారు. చెరువుల్లో పట్టే చేపలను స్థానికంగా విక్రయించుకోవడానికి వీలుగా మార్కెట్ సదుపాయం కల్పించాలన్నారు. అంతేకాకుండా చేపల పెంపకంలో మత్స్యకారులకు సలహాలు, సూచనలతో పాటు పడవలు, వలలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, చంద్రయ్య, శ్రీశైలం, భిక్షపతి, గోపాల్, లోకేశ్, జగన్, శివరాజ్, మహేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్



స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సన్మానిస్తున్న మండల మత్స్యకారులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో మత్స్యకార సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ సమీపంలో గల నెక్లెస్ రోడ్ ఐమ్యాక్స్‌లో జరిగిన కార్యక్రమంలో మొయినాబాద్ మండల మత్స్యకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మత్స్యకార చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల మత్స్యకార చైర్మన్ భిక్షపతి, కావలి రమేశ్, శ్రీశైలం, మల్లేశ్, గణేశ్, నవీన్, ప్రవీణ్ తదితరులు కలిసి గడ్డం ప్రసాద్‌ను సన్మానించారు.

సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరం

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓలు, సూపర్‌వైజర్లు
- షాద్‌నగర్ డివిజన్‌లో 87 శాతం పూర్తి



షాద్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. వివరాల సేకరణలో అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 9 నుంచి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారు. ఒక్కో ఇంటికి కనీసం అరగంటకుపైె సమయం పడుతోందని చెబుతున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 87శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

మొత్తం 70,036 ఇళ్లు

షాద్‌నగర్ నియోజకవర్గంలో కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలతో పాటుగా షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో మొత్తం 70,036 ఇళ్లు ఉన్నాయి. మొత్తం 842 మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని కొత్తూరులో 80శాతం, నందిగామలో 90శాతం, కేశంపేటలో 87శాతం, కొందుర్గులో 84.5శాతం, ఫరూఖ్‌నగర్‌లో 86శాతం, సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గం మొత్తంలో ఇప్పటి వరకు 87శాతం సర్వే పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

బ్లాక్‌ల వారీగా విడిపోయి

సర్వేలో భాగంగా 120 నుంచి 150 కుటుంబాలకు ఒక బ్లాక్‌గా గుర్తించారు. షాద్‌నగర్ డివిజన్‌ను 593 బ్లాక్‌లుగా విభజించారు. సర్వే కోసం సిబ్బంది బ్లాకుల వారీగా విడిపోయి ప్రతి ఇంటికి వెళ్లి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర అంశాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు.

కుటుంబాలను గుర్తిస్తూ..

డివిజన్ల వారీగా కుటుంబాలను గుర్తిస్తూ ప్రతీ ఇంటికి కుటుంబ లెక్కల కోసం వేసిన స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేను ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖల ఉద్యోగులు, మున్సిపల్, కార్పొరేషన్ల సిబ్బంది, ఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఎన్యుమేటర్లుగా పని చేస్తున్నారు. అధికారులు సిబ్బంది నిర్వహించే సర్వేను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ రోజువారీ లక్ష్యాన్ని పూర్తి చేసేలా సూచనలు చేస్తున్నారు.

భద్రంగా పత్రాలు

ఎన్యుమరేటర్లు సర్వే చేసి రాసుకొచ్చిన ఫారాలను ప్రత్యేక అధికారికి అందజేసి సంతకాలు తీసుకుంటున్నారు. వీటన్నింటినీ ఆన్‌లైన్ చేసేంతవరకు భద్రపర్చడానికి వీలుగా ప్రత్యేక రాక్‌లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ నమోదు కోసం కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షణ



ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సమగ్ర వివరాలు సేకరిస్తున్నారు. సర్వేను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 87శాతం సర్వే పూర్తయింది.

– రామారావు, ప్రత్యేకాధికారి, షాద్‌నగర్

దాతల సహకారం అభినందనీయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యేకు నగదు అందజేస్తున్న నాయకుడు నర్సింహాయాదవ్

నందిగామ: నియోజకవర్గ కేంద్రమైన షాద్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి దాతలు స్వచ్ఛందగా ముందుకు వచ్చి సహకరిస్తుండడం అభినందనీయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుమ్మల నర్సింహాయాదవ్ గురువారం తనవంతు సహాయంగా రూ.51వేల నగదును ఎమ్మెల్యేకు ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలను నిర్మించాలని తలపెట్టామని, దీనిని దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ వ్యాప్తంగా దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా ఆర్థికసాయం అందిస్తున్నారన్నారు. దాతల సహకారంతో వీలైనంత త్వరలో అత్యాధునికంగా కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, బాబార్‌ఖాన్, దంగు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ ధర్నా

- బైక్‌ను అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం
- పరిహారం చెల్లించాలని డిమాండ్



లేమామిడిలో ధర్నా నిర్వహిస్తున్న పోమాల్‌పల్లి గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఇటీవల రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన మల్లేశ్ గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. లేమామిడి గ్రామానికి చెందిన నందంచారి బైక్‌ను అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని ఆరోపిస్తూ మృతుడు మల్లేశ్ బంధువులు, స్నేహితులు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌తో లేమామిడి గ్రామంలోని నందంచారి ఇంటికి చేరుకున్నారు. గ్రామస్తులు, నందంచారి కుటుంబసభ్యులు నష్టపరిహారం ఇచ్చేందుకు ఇష్టపడటం లేదని ఆరోపిస్తూ గ్రామంలోని షాద్‌నగర్, అమనగల్లు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్ సిబ్బందితో అక్కడి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాలతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

- గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా

షాద్‌నగర్‌రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా అన్నారు. గురువారం పట్టణం సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీతా మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో పుస్తకాల నిధి ఉంటుందన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివితే కొత్త విషయాలను తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులు పుస్తకాలను చదవడం అలవాటు చేసుకుంటే మేథోశక్తి పెంపొందుతుందన్నారు. విద్యార్థులకు కావాల్సిన కొన్ని పుస్తకాలు బయట దుకాణాలలో లభించవని, గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు ఉంటాయన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన అనేక పుస్తకాలు గ్రంథాలయాలలో అందుబాటులో ఉంటాయని, ఈ పుస్తకాలను చదువుకొని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. గ్రంథాలయాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, లైబ్రేరియన్ జ్యోతి, రేణుక, అధ్యాపక బృందం, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన కనకమామిడి ఆలయ సభ్యులు



టీటీడీ చైర్మన్‌ను సన్మానిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

మొయినాబాద్‌రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్ బీ.ఆర్ నాయుడును మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గ్రామ వేంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గురువారం నగరంలోని టీటీడీ చైర్మన్ నివాసంలో ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి కనకమామిడి వేంకటేశ్వర స్వామి దేవాలయానికి రావాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. ఆయన స్పందిస్తూ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు. చైర్మన్‌ను కలిసిన వారిలో కోట్ల భలవంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ నుంచి చింతకుంటపల్లి వరకు బీటీరోడ్డుపై ఏర్పడిన గుంతలను దాతల సహకారంతో గ్రామస్తులు గురువారం పూడ్చివేశారు. చింతకుంటపల్లి బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన అల్లు శ్రీధర్‌రెడ్డి, అనేమోని మల్లేశ్‌యాదవ్‌లు సొంత ఖర్చులతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మట్టిని వేయించారు. రోడ్డుకు మరమ్మతులు చేయడంపై గ్రామస్తులు దాతలను అభినందించారు. కార్యక్రమంలో జంగయ్య, లింగంయాదవ్, రమేశ్, శ్రీయాదవ్, కుమ్మరి రాజు, నరేశ్, రమేశ్, జంగయ్య, శంకర్, షేర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐశ్వర్య సిల్క్స్ సెంటర్ ప్రారంభం



చీరలను పరిశీలిస్తున్న యాంకర్ సుమ, పక్కన యజమాని నాగలక్ష్మి

శంకర్‌పల్లి: పట్టణ కేంద్రంలో ప్రముఖ యాంకర్ సుమ కనకాల సందడి చేశారు. శంకర్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడో ఐశ్వర్య సిల్క్స్ సెంటర్‌ని ఆమె ప్రారంభించారు. యాంకర్ సుమకి మహిళల్లో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండడంతో మహిళా అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి, ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా సుమ మాట్లాడుతూ.. ఐశ్వర్య సిల్క్స్‌లో చాలా రకాల కలెక్షన్లు ఉన్నాయని, శంకర్‌పల్లి పట్టణంతో పాటు చుట్టుపక్క గ్రామాల మహిళలు సెంటర్‌ని సందర్శించి, చీరలను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సెంటర్ బ్రాంచులు ఇప్పటికే కూకట్‌పల్లి, చందానగర్‌లలో ఆదరణ పొందుతున్నాయని స్పష్టం చేశారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

షాబాద్: రైతును రాజు చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం సన్నాలు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. ఆనాడు రైతులకు వైఎస్సార్ లక్ష రుణమాఫీ చేశారని, నేడు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎవరైనా మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, పొల్యూషన్ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ జిల్లా చైర్మన్ కృష్ణారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ చల్లా రాంరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు అశ్విని, మండల ఉపాధ్యక్షుడు రవీందర్‌యాదవ్, నాయకులు వెంకటేశ్, సుభాష్‌రెడ్డి, గౌరీ, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మల్లేశ్, కుమ్మరి చెన్నయ్య, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, జంగయ్య, మాజీ సర్పంచ్‌లు రవీందర్ నాయక్, ప్రతాప్‌రెడ్డి, మునగపాటి నర్సింలు, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, విజేందర్‌రెడ్డి, సత్యం, శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సమస్యలు రానీయొద్దు

ప్రత్యేకాధికారి బాలకృష్ణారెడ్డి



భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

చేవెళ్ల/శంకర్‌పల్లి: వసతి గృహాల్లో విద్యార్థులకు సమస్యలు లేకుండా చూసుకోవాలని శంకర్‌పల్లి మండల డిప్యూటీ తహసీల్దార్, ప్రత్యేకాధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం చుట్టూ మున్సిపల్‌కు చెందిన వాహనాలు నిలపడంతో ఈ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, దీంతో వసతి గృహంలోకి దోమల బెడద ఎక్కువైందని విద్యార్థులు చెప్పారు. వెంటనే ఆయన అక్కడి నుంచి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సీ వసతి గృహం పక్కన ఉన్న మున్సిపల్ వాహనాలను ఇక్కడి నుంచి తొలగించాలని సూచించారు. వసతి గృహంలో ఉన్న మరుగుదొడ్లను, నీటి వసతులను పరిశీలించారు. వంట గదిలోకి వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. వంట సిబ్బందితో మాట్లాడి పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. వసతి గృహం పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్టును పరిశీలించారు. దానిని తొలగించాలని వార్డెన్‌కు ఆదేశించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి



చౌదరిగూడలో బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న భూపాలచారి

కొందుర్గు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి సూచించారు. గురువారం చౌదరిగూడ ఆర్య సమాజంలో పార్టీ మండల అధ్యక్షుడు కుర్మయ్య అధ్యక్షతన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు అభియాన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పార్టీ సభ్యత్వాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో వార్డు సభ్యుల దగ్గర నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ వరకు అన్నింటా బీజేపీ ముందంజలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మండల వ్యవసాయ అధికారి అనురాధ



హిమాయత్‌నగర్ సమీపంలోని చెరువులో చేపలు వదులుతున్న అధికారి అనురాధ తదితరులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మండల వ్యవసాయ అధికారి, హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి అనురాధరెడ్డి, అఖిల భారత రాష్ట్ర యాదవ సంఘం కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల బూరుకుంట గండిపేట చెరువులో ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన చేపలను వదిలే కార్యక్రమాన్ని గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బి.మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రభుత్వం ద్వారా విచ్చేసిన 30వేల చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో కార్యదర్శి సంధ్యారాణి, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు గిరి, ప్రధాన కార్యదర్శి జగదీశ్, ముదిరాజ్ సంఘం సభ్యులు నర్సింహ, శ్రీనివాస్, నరేశ్, హరీశ్, సత్తయ్య, హోటల్ చంద్రయ్య, అశోక్, కుమార్, శ్రీనివాస్, మల్లేశ్, ప్రకాశ్, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో ఉన్న పెద్ద చెరువులో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం చేపపిల్లలు వదిలారు. మత్సకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ద్వారా అందజేసిన సుమారు 15 వేల చేపపిల్లలను పెద్దమంగళారం పెద్ద చెరువులో వదిలారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యాక్షుడు మల్లేశ్, నాయకులు వెంకటేశ్, ఈశ్వర్, నాగభూషణం, శ్రీనివాస్, నర్సింహ, నరేందర్ పాల్గొన్నారు.

గోమాత సకల దేవతలతో సమానం



శ్రీకృష్ణ గోశాలకు గడ్డి అందజేస్తున్న సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ చంద్రయ్య

షాద్‌నగర్‌రూరల్: గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ చంద్రయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామానికి చెందిన చంద్రయ్య గురువారం పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో గల శ్రీకృష్ణ గోశాలకు గడ్డిని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. గోవులను రక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. గో సేవ మహా పుణ్యమని, ప్రతి ఒక్కరూ గోవులను పూజించాలన్నారు. గోవులో కోటి దేవతలు కొలువై ఉంటారని, గోవును పూజిస్తే కోటి దేవతలను కొలిచిన పుణ్యఫలం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం గడ్డిదానం చేసిన చంద్రయ్యను మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ లతశ్రీ అభినందించారు.

స్వాముల పాదయాత్ర విజయవంతం



18వ సారి మాల పూర్తిచేసుకున్న గురుస్వామి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న అయ్యప్ప భక్తులు

మొయినాబాద్‌రూరల్: స్వామియే శరణం అయ్యప్ప అంటూ అజీజ్‌నగర్ గ్రామం నుంచి 130 మంది స్వాములు మాల ధరించి గత నెల అక్టోబర్ 15న హనుమాన్ దేవాలయంలో ఇరుముళ్లు కట్టుకొని గురుస్వామి అల్లం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జై శ్రీరామ్ శబరిమల మహాపాదయాత్ర పేరుతో బయలుదేరారు. పాదయాత్రగా బయలుదేరిన స్వాములు గురువారం కేరళలోని అయ్యప్ప సన్నిధానంలో స్వామిని దర్శించుకున్నారు. ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, 18వ సారి మాల ధరించిన అల్లం శ్రీనివాస్‌రెడ్డిని స్వాములు సన్నిధానంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అల్లం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో తెలంగాణ అయ్యప్ప స్వాములను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించి శబరిమల వెళ్లే స్వాములకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాదయాత్ర విజయవంతం చేసిన స్వాములందరికీ జై శ్రీరామ్ శబరిమల పాదయాత్ర సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా ఆయా ప్రాంతాల అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి చర్యలు

ఏపీఎం శోభారాణి



సంఘాల్లో చేరాలని కోరుతున్న సభ్యులు

చేవెళ్ల: గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేసుకునేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు ఏపీఎం శోభారాణి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఇందిరా మహిళా శక్తి ఉత్సవాల్లో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్లి మహిళా సంఘాల్లో లేని వారిని బొట్టు పెట్టి మహిళా సంఘాల్లోకి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి ప్రభుత్వం అందించే పథకాలతో పాటు రుణబీమా, ప్రమాదబీమా సౌకర్యాలను కూడా సంఘంలోని సభ్యులకు కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా సంఘాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. ప్రతి మహిళ మహిళా సంఘంలో ఉండాలని చెప్పారు. ప్రస్తుతం మండలంలో 192 మందిని గుర్తించామన్నారు. ఇంకా గ్రామాల్లో ఎవరైనా మహిళలు సంఘాల్లో చేరకుండా ఉంటే వారు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులు వీఏఓలు, సీసీలు పాల్గొన్నారు.